
30న ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా పోటీలు

పార్వతీపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగులకు ఈ నెల 30న ఆర్‌సీఎం స్కూల్ కాంప్లెక్స్ వద్ద క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, హాకీ, కబడ్డీ తదితర క్రీడల్లో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహిస్తామని చెప్పింది. జిల్లా స్థాయిలో ఎంపికైన ఉద్యోగులను నవంబరు 6 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని, వివరాలకు 9866805716, 9701648344 నెంబర్లను సంప్రదించాలని సూచించింది.

నిలకడగా నాగావళి

● అప్రమత్తమైన తోటపల్లి అధికారులు

గరుగుబిల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో నీటి ప్రవాహం నిలకడగా ఉంది. శుక్రవారం నాటికి ప్రాజెక్టులోకి పైనుంచి 1500 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు అధికారులు నది నుంచి కిందకు 150 క్యూసెక్కులు, ప్రధాన కాలువల నుంచి సాగునీటి అవసరాల నిమిత్తం 1,420 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను ప్రస్తుతం 102.57 మీటర్ల నీరు నిల్వ ఉంది. తుఫాన్‌తో ఒడిశాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమయ్యారు. అధికంగా వర్షాలు కురిసిన పక్షంలో తమకు సమాచారం అందించాలని ప్రాజెక్టు డీఈ టి.రఘునాథనాయుడు, జేఈలు శ్రీనివాసరావు, కిషోర్‌కుమార్.. ఒడిశా అధికారులను కోరారు.



తోటపల్లి స్పిల్‌వే నుంచి దిగువకు విడుదల చేస్తున్న నీరు




చిన్నపాటి గాలులకు పాలకొండలో నేలకొరిగిన వరి చేను

తప్పిన దానా ముప్పు

● ఊపిరిపీల్చుకున్న జిల్లా రైతాంగం

పాలకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు దానా తుఫాన్ ముప్పు తప్పింది. దీంతో జిల్లా రైతాంగం ఊపిరిపీల్చుకుంది. తుఫాన్ ప్రభావం ఉత్తరాంధ్రపై ఎక్కువగా ఉంటుందని.. గురు, శుక్రవారాలు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. అయితే, ఒడిశా వద్ద తుఫాన్ తీరం దాటడంతో జిల్లాపై ఎలాంటి ప్రభావం చూపలేదు. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 2 లక్షల ఎకరాల్లో వరి, మరో రెండు లక్షల ఎకరాల్లో అరటి, మొక్కజొన్న, పత్తి వంటి పంటలు సాగు అవుతున్నాయి. వరి కోతదశలో ఉంది. ఈ సమయంలో తుఫాన్ ప్రభావంతో 80 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందారు. అయితే, గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా చిన్నపాటి గాలులు వీచాయి. దీనివల్ల అక్కడక్కడ వరి చేలు నేలకొరిగాయి. నష్టం పెద్దగా సంభవించలేదని రైతులు చెబుతున్నారు.



కోతకు సిద్ధంగా ఉన్న పంట

జనవరి నుంచి తల్లికి వందనం

- విద్యార్థులకు రూ.15వేల చొప్పున అందించనున్న ప్రభుత్వం
- ఎంతమంది పిల్లలు చదివితే అంతమందికీ వర్తింపు
- తల్లిదండ్రుల్లో ఆనందం
- మన్యంలో 1,18,547 మంది విద్యార్థులు



గరుగుబిల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. ఇప్పటికే పింఛన్ల పెంపు, ఉచిత ఇసుక, ల్యాండ్ టైట్లింగ్ రద్దు, ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాల చెల్లింపు తదితర హామీలను నెరవేర్చింది. అలాగే, ఈ దీపావళి నుంచి దీపం పథకం కింద మహిళలకు ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా అందించనుంది. ఇప్పుడు 'సూపర్ సిక్స్'లో కీలకమైన తల్లికి వందనం పథకాన్ని వచ్చే జనవరి నుంచి అమలుకు శ్రీకారం చుట్టింది. పాఠశాలలు, జూనియర్ కాలేజీలకు వెళ్లే విద్యార్థుల తల్లులందరికీ ఈ పథకం కింద లబ్ధి చేకూరనుంది. ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు చదివితే అంతమందికీ పథకాన్ని వర్తింపజేసి రూ.15వేల చొప్పున అందించనుంది.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 1,749 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలలు 1,583, ప్రైవేటు పాఠశాలలు 166 ఉన్నాయి. జిల్లాలో 1 నుంచి 5వ తరగతికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లో 39,903 మంది, 6 నుంచి 10వ తరగతి వరకు 54,099 మంది, అలాగే ప్రైవేటు పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు 12,121 మంది, 6 నుంచి 10వ తరగతి వరకు 12,451 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికీ తల్లికి వందనం పథకం అమలు కానుంది. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను చెల్లించే వారి పిల్లలకు ఈ పథకం వర్తించదు. ఒకే ఇంటిలో ఇద్దరు విద్యార్థులు ఉంటే వారికి రూ.30 వేలు మంజూరు కానుంది. అయితే ప్రభుత్వ నిబంధనల మేరకు విధిగా పాఠశాలలకు వెళ్లే వారికి మాత్రమే పథకం వర్తిస్తుంది. 75 శాతం హాజరు కచ్చితంగా ఉండాలి. ఇప్పటికే మండలాల వారీగా విద్యార్థుల వివరాలతో పాటు తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలను సేకరించే పనిలో ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు.

అమ్మఒడికి ధీటుగా..

గత వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన అమ్మఒడి పథకానికి ధీటుగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ఇంటిలో ఎంతమంది చదివినా ఒక్కరికే గత ప్రభుత్వం అమ్మఒడిని అందించింది. ఒక్కో తల్లికి రూ.15వేలు అని ప్రచారం చేసినా వాస్తవంగా ఇచ్చింది రూ.13వేలు మాత్రమే. పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ నిధి కింద రూ.వెయ్యి, పాఠశాలల నిర్వహణ నిధి కింద మరో రూ.వెయ్యి కోత పెట్టారు. పైగా ఈ పథకానికి అర్హత ఉన్నా పలు నిబంధనలతో మంజూరుకాని పరిస్థితి అప్పట్లో నెలకొంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తదుపరి ఒక ఇంటిలో ఎంతమంది విద్యార్థులు ఉన్నా వారందరికీ పథకం అమలుపర్చేందుకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన రోడ్లు బాగుపడేనా?

- ఏజెన్సీలో అధ్వానంగా రహదారులు
- గత ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ సర్కారు
- పీఎం సడక్ యోజనపైనే ఆశలు

భామిని, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భామిని ఏజెన్సీలో పలు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. రాళ్లురప్పలతో కనీసం మనుషులు నడవలేని విధంగా తయారయ్యాయి. దీంతో కొండలపై ఉన్న గ్రామాలకు వెళ్లేందుకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భామిని మండల కేంద్రం నుంచి కోటకొండ, కోసింగూడ గ్రామాలకు రహదారి కరువైంది. డోకులగూడ, మూలగూడ, జామిగూడ తదితర గిరిజన గ్రామాలకు గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో తాత్కాలిక రోడ్లు నిర్మించారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు రోడ్ల నిర్వహణను పట్టించుకోలేదు. దీంతో రోడ్లు పాడయ్యాయి. రాళ్లు తేలిపోవడంతో వాటిపై కనీసం నడవలేకపోతున్నామని గిరిజనులు వాపోతున్నారు. అదే విధంగా తివ్వకొండ శిఖరంపై ఉన్న కోటకొండ, కోసింగూడ గ్రామాలకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్డు ప్రస్తుతం కనుమరుగైంది. బంద్రసింగి, కడంబసింగి ఘాట్ రోడ్డు కూడా పూర్తిగా దెబ్బతింది. ప్రతి ఏటా ఆదివాసీ గ్రామాల్లో రోడ్లు నిర్మాణానికి రూ.కోట్లలో ఖర్చుపెడుతున్నామని ప్రభుత్వాలు లెక్కలు చూపుతున్నాయి. కానీ, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఒక్కసారి అధికారులు తమ గ్రామాలకు వచ్చి చూడాలని గిరిపుత్రులు కోరుతున్నారు. ఏటా ఈ సీజన్‌లో రోడ్ల నిర్మాణ ప్రతిపాదనలు పేరిట హడావుడి చేసి తర్వాత పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రధాన మంత్రి సడక్ యోజన ద్వారా గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో గిరిపుత్రుల్లో ఆశలు చిగురించాయి. మణిగ గ్రామం నుంచి కోటకొండ దుర్గమ్మ ఆలయంతో పాటు మిగిలిన గిరిజన గ్రామాలకు కూటమి ప్రభుత్వంలో అయినా రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.



రాళ్లు తేలిన మూలగూడ రహదారి



కోటకొండ రహదారి దుస్థితి

కోటకొండ-మణిగ రహదారిని కలపాలి



కోటకొండ, మణిగం గ్రామాలను కలుపుతూ రహదారిని నిర్మించాలి. సుమారు ఆరు కిలోమీటర్ల రోడ్డు నిర్మిస్తే భామిని మండల కేంద్రం దగ్గర అవుతుంది. దీనివల్ల కోటకొండలోని కోటదుర్గమ్మ గుడి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుంది.

-పాలక తురకన్న, కోటకొండ, భామిని

ఏబీ రోడ్డు పనులు పూర్తి చేయాలి



ఏబీ రోడ్డు పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఎక్కడికక్కడే రాళ్లు తేలి రహదారి దారుణంగా తయారైంది. పల్లపు ప్రాంతాలకు రావాలంటే నరకం చూస్తున్నాం. ఇప్పటికైనా ఏబీ రోడ్డు పనులు పూర్తి చేయాలి.

- కొండగొర్రె ప్రసాద్, డోకులగూడ

సర్వే చేపడతాం

కొండలు, పల్లపు ప్రాంతాలపై అర్థాంతరంగా పనులు నిలిచిన రహదారులను గుర్తిస్తాం. లింకు రోడ్లకు అవసరమైన సర్వే చేపడతాం. సడక్ యోజన కింద రోడ్లను నిర్మిస్తాం.

-గౌరీశంకర్, పీఆర్, జేఈఈ



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పాడి సంపదతో ఆర్థికాభివృద్ధి: కలెక్టర్

బెలగాం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పాడి సంపదతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పశు సంపదపై దృష్టి సారించి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని అన్నారు. పశు గణనను జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. వచ్చే ఫిబ్రవరి 28 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. జిల్లాలో ప్రతీ ఇంటిని సందర్శించి పశువుల సమగ్ర సమాచారాన్ని సేకరించాలన్నారు. పశు సంపదను ప్రోత్సహిస్తూ, వాటి ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్యశాఖ అధికారి డా.ఎస్.మన్మథరావు పాల్గొన్నారు.

మల్లె మళ్లీ అది రాని రోజు

- సాలూరులో తగ్గిన మల్లెల గుబాళింపు
- భారీగా పడిపోయిన సాగు
- నాడు ఘనం.. నేడు దైన్యం

8లో



పార్లమెంట్ సమావేశాలను తలపించేలా..

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం నిర్వహించిన మాక్ పార్లమెంట్ కార్యక్రమం ఆకట్టుకుంది. స్పీకర్‌గా శివానంద్ (థర్డ్ ఎంపీసీఎస్), ప్రధానమంత్రిగా కుమారి పద్మిని (సెకెండ్ సీబీజెడ్) వ్యవహరించారు. ప్రతిపక్ష హోదాలో తరుణి(సీబీజెడ్) విద్యార్థి అధికార పక్షానికి పలు ప్రశ్నలు సంధించారు. కేంద్ర మంత్రులుగా వ్యవహరించిన కొందరు విద్యార్థులు వాటికి సమాధానాలు చెప్పారు. అనంతరం ప్రతిపక్షం వాకౌట్ చేసి బయటకు రావడంతో.. సభాపతి శివానంద్ అధికార పక్షంతో సమావేశాన్ని కొనసాగించారు. ఈకార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకుంది.



కొయ్యానపేట వీఆర్వో సస్పెన్షన్

- మక్కువ తహసీల్దార్, ఆర్ఐలకు షోకాజ్ నోటీసులు
- ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్

పార్వతీపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మక్కువ మండలం కొయ్యానపేట గ్రామ రెవెన్యూ అధికారి ఎస్.రూపవతిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. అలాగే, తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, ఆర్ఐ కె.స్వాతికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. కొయ్యానపేట రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్-45 ఐదో భాగంలో తనకు 50 సెంట్ల భూమి ఉందని, ఆ భూమిని బురిడీ చిన్నారావు ఆక్రమించుకున్నాడని రవీంద్రనాథ్ ఠాగూర్ అనే వ్యక్తి ఈ నెల 15న రెవెన్యూశాఖ మంత్రి సత్య ప్రసాద్‌కు ఫిర్యాదు చేశాడు. భూ రికార్డులు చిన్నారావు పేరుపై ఉన్నాయని, తనకు న్యాయం చేయాలంటూ రవీంద్రనాథ్ కోరాడు. దీనిపై మంత్రి స్పందిస్తూ వెంటనే విచారణ జరపాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ ఉన్నతాధికారులను విచారణకు ఆదేశించారు. గతంలో కూడా ఈ ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించినా గ్రామ వీఆర్వో రూపవతి స్పందించలేదు. దీంతో ఆమెను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా తహసీల్దార్, ఆర్ఐకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఈ విషయాన్ని ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి కేశవనాయుడు ధ్రువీకరించారు.

మల్లె మళ్లీ అది రాని రోజు!


మల్లెపూలు సేకరిస్తున్న కూలీలు



- సాలూరులో తగ్గిన మల్లెల గుబాళింపు
- భారీగా పడిపోయిన సాగు
- నాడు ఘనం... నేడు దైన్యం

సాలూరు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో సాలూరు అంటే మల్లెలకు ప్రసిద్ధి. కానీ ఆ సువాసనలు చరిత్రగా మిగిలిపోతున్నాయి. సాలూరులో నాడు వందల ఎకరాల్లో మల్లెలు సాగు చేసేవారు. ప్రస్తుతం ఈ విస్తీర్ణం రెండంకెలకు పడిపోయింది. కొంతకాలంగా వీటి సాగుకు రైతులు మొగ్గు చూపడం లేదు.

ఏదీ నాటి వైభవం?

సాలూరులో మల్లెపూల సాగుకు రైతులు గతంలో మొగ్గు చూపేవారు. వేసవి వచ్చిందంటే మల్లె రైతుల పంట పండేది. గతంలో 456 ఎకరాలకు పైబడి సాగు చేసేవారు. ప్రధానంగా మెంటాడ వీధికి చెందిన పూల రైతులు వీటిని సాగు చేసేవారు. ఇక్కడి నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు మల్లెలు ఎగుమతి చేసేవారు. ఒడిశాకు కూడా ఇక్కడి నుంచే మల్లెలు వెళుతుండేవి. కిలోల లెక్కన ఉదయం, సాయంత్రం రెండు విడతలుగా ఈ పూల ఎగుమతి జరిగేది. రైతులకు పెట్టుబడి పోను ఎకరానికి అప్పట్లో రూ.వేలల్లో లాభాలు కనిపించేవి.


శివాలయం రోడ్డులో మల్లెతోట స్థానంలో వెలసిన కాలనీ

రియల్ ఎస్టేట్‌తో...

గత కొన్నేళ్లుగా సాలూరు ప్రాంతంలో రియల్ ఎస్టేట్ భూమ్ పెరిగింది. వేలల్లో ఉన్న భూముల ధరలు రూ. లక్షలు.. రూ. కోట్లకు చేరాయి. సాలూరు పట్టణానికి సమీపంలో ఉన్న మల్లెతోటల భూముల ధరలు అమాంతంగా పెరిగాయి. దీంతో మల్లెల సాగు వల్ల వచ్చిన ఆదాయం పడిపోయింది. దీంతో భూమి విక్రయిస్తే మంచి లాభమని రైతులు భావించారు. ఆ భూములను ఇళ్ల స్థలాలకు, అపార్ట్‌మెంట్లకు విక్రయించారు. గతంలో మల్లెతోటలు సాగయిన చోట ప్రస్తుతం ముమ్మరంగా ఇళ్లు, అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు సాగుతున్నాయి.

సాగు సమస్యలు..

మల్లెతోటల సాగుకు అనేక సమస్యలు ఉన్నాయి. ప్రస్తుతం పూలు సేకరించే కూలీల కొరత వేధిస్తోంది. యువతరం పూలసాగుకు మొగ్గు చూపడం లేదు. చదువుకొని ఉద్యోగాలు చేయడానికి ప్రాధాన్యమిస్తున్నారు. పూల సేకరణకు వచ్చే కూలీలకు రోజుకు రూ. 200 ఇచ్చినా గిట్టుబాటు కావడం లేదని అంటున్నారు. మరో వైపు వ్యాపారుల ధరల మాయాజాలంతో మల్లెపూల సాగుకు రైతులు దండం పెట్టేశారు. ప్రస్తుతం కేవలం 16 ఎకరాల్లో మల్లెపూలు సాగవుతున్నాయి. వాటిలో వ్యాపారులే సాగు చేస్తున్న భూములు అధికంగా ఉన్నాయి. పూల దిగుబడి లేకపోవడంతో ఎగుమతులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఇక్కడి భూముల్లో పండే మల్లెలు కేవలం ఒడిశాకే ఎగుమతి చేస్తున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు.

ఆనందపురం మార్కెట్ ప్రభావం..

విశాఖ జిల్లా ఆనందపురంలో పూల మార్కెట్ వెలసింది. అక్కడికి వివిధ ప్రాంతాల నుంచి అన్ని రకాల పూలు వస్తున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాలకు ఆనందపురం పూల మార్కెట్ ప్రధాన వేదికగా మారింది. దీంతో సాలూరు మల్లెలకు డిమాండ్ తగ్గింది. ఇక్కడ పండే కొద్దో గొప్పో మల్లెలు ఒడిశాకు పంపిస్తున్నారు.

కూలీల కొరత



మల్లెల సాగుకు సమస్యలు అధికంగా ఉన్నాయి. కూలీల కొరత ఉంది. రైతుల కుటుంబ సభ్యులు గతంలో మాదిరిగా పూలసాగు వైపు మొగ్గు చూపడం లేదు. సాగు చేసినా... సొంతంగా రైతు విక్రయించుకోలేని పరిస్థితి ఉంది. అందుకే మల్లెల సాగు తగ్గింది.

-ఆల్తి అప్పారావు, మల్లెపూల రైతు, సాలూరు

నష్టపోతున్నాం..



మల్లెల సాగు వల్ల నష్టపోతున్నాం. పెట్టుబడులు పెరిగాయి. దిగుబడి తగ్గిపోతోంది. కూలీల సమస్య వెంటాడుతోంది. రెండున్నర ఎకరాల్లో మల్లెలు సాగు చేస్తున్నాను. ఈ వేసవిలో మల్లెల వల్ల రూ. 1.50 లక్షల నష్టం వచ్చింది. ఆనందపురం పూల మార్కెట్ వల్ల ఇక్కడ మల్లెపూలకు గిరాకీ తగ్గింది. అందుకే ఒడిశాకు పంపిస్తున్నాను.

-పతివాడ నారాయణరావు, పూల వ్యాపారి, సాలూరు

అయినా.. ప్రతిభ దాగలేదు!

- పల్లె నుంచి ఢిల్లీకి మన విద్యార్థినులు
- ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు హాజరు
- సైన్స్ ప్రాజెక్టులతో గుర్తింపు

ప్రతిభకు పేదరికం... కుటుంబ నేపథ్యం అడ్డు కావన్నది ఆ విద్యార్థినుల విషయంలో మరోసారి నిజమైంది. సాధారణ కుటుంబాలలో పుట్టి... గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ఆ విద్యార్థినులు తమ ఆవిష్కరణలతో ఎంతోమంది ప్రముఖులను మెప్పించారు.

రాజాం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆ ముగ్గురిదీ గ్రామీణ నేపథ్యం... ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. ఓ బాలిక తండ్రి పల్లెలో టైలర్... మరో బాలిక తండ్రి తాపీమేస్త్రి. ఇంకో విద్యార్థిని తండ్రి డ్రైవర్. రెక్కాడితేనే డొక్కాడేది. అయితేనేం.. చదువుపై శ్రద్ధ.. కొత్తదనంపై ఆసక్తి.. ఏదైనా సాధించాలన్న తపన.. వీరి ఆలోచనలకు రూపం కల్పించే భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడి తోడ్పాటు... వెరసి సైన్స్ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. ఫలితంగా ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఆహ్వానం అందుకున్నారు. అప్పటి వరకూ పల్లె దాటని ఆ బాలికలు దేశ రాజధాని ఢిల్లీలో 2023 జనవరిలో జరిగిన కార్యక్రమంలో భాగంగా అయిదు రోజుల పాటు సైన్స్ విలేజ్‌లో గడిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులతో మమేకమయ్యారు. ఆలోచనలు పంచుకున్నారు. ప్రదర్శించిన ప్రాజెక్టులను తిలకించారు. కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టేలా ప్రణాళికలను తయారు చేసుకున్నారు. సైంటిస్టుల ప్రయోగాలను పరిశీలించారు. వారి విజయాలను తెలుసుకున్నారు. వారి సమక్షంలో సూక్ష్మదర్శిని (ఫోల్డ్‌స్కోప్) తయారు చేశారు. ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. వారే రాజాం మండలం కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థినులు పెనుబోతుల సౌజన్య, పైలా సత్యవతి, పిల్లా శిరీష. ఆ అనుభూతి.. వారి మాటల్లోనే..


సూక్ష్మదర్శిని పరిశీలనలో...



క్షిపణి వివరాలు తెలుసుకుంటూ...

అదో అద్భుతమైన ప్రపంచం..



సైన్స్ విలేజ్.. అదో అద్భుతమైన సైన్స్ ప్రపంచం. దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి విద్యార్థినీ విద్యార్థులు, సైంటిస్టులు హాజరైన వేదిక. అందులో పాల్గొనేందుకు ఆహ్వానం వచ్చిందని మా సైన్స్ ఉపాధ్యాయుడు వేణుగోపాల్ చెప్పేసరికి నా సంతోషానికి అవధుల్లేవు. ఈ విషయాన్ని మా అమ్మ, నాన్నలు స్వాతి, శంకరరావులకు చెప్పాను. వాళ్లకేమీ అర్థం కాలేదు.. తొలుత వద్దన్నారు. చివరికి వెళ్లేందుకు అంగీకరించారు. అక్కడ ఎన్నో విషయాలు తెలుసుకున్నాను.

-సౌజన్య, వస్త్రపురి కాలనీ, రాజాం

ఎన్నో తెలుసుకున్నా..



ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు వెళ్తానని నేను కలలో కూడా అనుకోలేదు. మా భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడి సహకారంతో మేం చేసిన కృషికి గుర్తింపు దక్కనుందని తెలిసి ఆశ్చర్యానికి గురయ్యాను. అయిదు రోజుల పాటు ఫెస్టివల్‌లో ఎన్నో సైన్స్ పరమైన అంశాలను తెలుసుకున్నాను. నాన్న రమణ డ్రైవర్. అమ్మ శ్రీదేవి గృహిణి.

-శిరీష, కంచరాం

గొప్ప అనుభూతి..



ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొనడం నాకు గొప్ప అనుభూతిగా మిగిలిపోయింది. ఢిల్లీ వెళ్తానని నేను ఎప్పుడూ అనుకోలేదు. మేధావుల సదస్సులో పాల్గొనడం చాలా సంతోషాన్నిచ్చింది. బ్రహ్మోస్ క్షిపణి నమూనాను చూశాం. ఎలా తయారు చేశారో తెలుసుకున్నాం. నాన్న గోవిందరావు తాపీ మేస్త్రి, అమ్మ సూరీడు గృహిణి.

-సత్యవతి, కొత్త కంచరాం



ఉంగరాడ ఎండీయూ వాహనంపై ఉన్న జగన్ చిత్రాలు

ఇంకా జగన్ చిత్రాలతోనే...

రేగిడి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు దాటినా ఆయన ఇంకా గుర్తించినట్టు లేదు. ఉంగరాడ గ్రామానికి సన్న బియ్యం పంపిణీ చేసే ఎండీయూ (మొబైల్ డిస్పాచ్ యూనిట్) వాహన నిర్వాహకుడు ఇంకా వైకాపా పాలనలోనే ఉన్నాడు. ప్రభుత్వం మారినా తన వాహనంపై మాజీ సీఎం జగన్ ఫొటోను తొలగించడం లేదు. అప్పటి సీఎం జగన్, ఆయన తండ్రి వైఎస్‌ల ఫొటోలు పెట్టుకొని బియ్యం పంపిణీ చేస్తున్నాడు. శుక్రవారం ఈ వాహనం సంకిలి సమీపంలో తిరుగుతూ కనిపించింది. వాస్తవానికి కూటమి సర్కారు వచ్చాక... ఎండీయూ వాహనాలపై ఉన్న అప్పటి సీఎం జగన్ చిత్రాలను తొలగించాలనే ఆదేశాలు ఉన్నాయి. కానీ వాహనం నిర్వాహకుడు మాత్రం ఆ ఆదేశాలను పాటించడం లేదు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఎరువుల కొరత లేదు

- సాలూరు ఏవో అనూరాధ పండా



సాలూరు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి.. పండించిన పంటలు చేతికొచ్చే తరుణం ఆసన్నమైంది. ఈ సమయంలో రైతుల కోసం చేపడుతున్న చర్యలను వివరిస్తున్నారు సాలూరు వ్యవసాయాధికారి అనూరాధ.

ప్రశ్న: ఎరువుల లభ్యత ఎలా ఉంది?

జవాబు: రైతులకు ఎరువుల కొరత రాకుండా కార్యాచరణ చేశాం. ఇప్పటికే కావలసిన ఎరువులు అందించాం. ఎరువుల కోసం రైతులు ఇబ్బంది పడొద్దు.

ప్ర: ఎరువులు ఒడిశాకు తరలిపోకుండా ఏం చేసున్నారు?

జ: ఏపీ ఎరువులు సాలూరు నుంచి ఒడిశాకు వెళ్లకుండా నిఘా ఉంది. ఎరువులు ఆర్బీకేలకు, పీఏసీఎస్‌లకు ఇండెంట్ ప్రకారమే తెప్పించి రైతులకు అందిస్తున్నాం. అవి పక్కదారి పట్టడానికి అవకాశాలు తక్కువ.

ప్ర: విత్తనాలపై పర్యవేక్షణ ఎలా ఉంది?

జ: రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడానికి ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నాం. ఎప్పటికప్పుడు విత్తనాల షాపులను తనిఖీ చేశాం. వీటిపై నిఘా నిరంతరం ఉంటుంది. పక్క మండలంలో విత్తనాలు వల్ల రైతులు దెబ్బ తిన్నారని తెలిసింది. సాలూరు మండలంలో అటువంటి పరిస్థితి లేదు. విత్తనాల కొనుగోలులో రైతులు అప్రమత్తంగా ఉండాలి.

ప్ర: టార్పాలిన్లు, ట్రాక్టర్ పరికరాలు అందిస్తారా?

జ: టార్పాలిన్లు, ట్రాక్టర్ పరికరాలు రాయితీపై కావాలని రైతులు వినతులిచ్చారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

భూములపై నివేదిక ఇవ్వండి

- నవంబరు మూడోవారం నుంచి ధాన్యం సేకరణ
- త్వరలో రీసర్వే ప్రారంభం
- జేసీ సేతు మాధవన్

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వం కేటాయించిన భూములను తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని జేసీ సేతు మాధవన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎలినేషన్ కమిటీ సమావేశం జరిగింది. జేసీ మాట్లాడుతూ గత 12 సంవత్సరాల్లో ప్రభుత్వ శాఖలు, సంస్థలు, ప్రవేటు సంస్థలు, సంఘాలు, అసోసియేషన్లకు కేటాయించిన భూములపై సమీక్షించారు. ఏ అవసరానికి ఆయా భూములకు ప్రభుత్వం కేటాయించిందో, దానికి మాత్రమే వినియోగించాల్సి ఉంటుందన్నారు. కేటాయించిన భూమిని 3 సంవత్సరాల్లో వినియోగంలోకి తేకపోతే ప్రభుత్వం వెనక్కి తీసుకునే అవకాశం ఉందన్నారు. తహసీల్దార్లు, సంబంధిత అధికారులు సంయుక్తంగా భూములను తనిఖీ చేసి సమగ్ర నివేదిక అందజేయాలన్నారు.

త్వరలో రీసర్వే..

జిల్లాలో భూముల రీసర్వే ప్రక్రియను త్వరలో పునఃప్రారంభించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని జేసీ తెలిపారు. మొత్తం 980 గ్రామాల్లో ఇప్పటికే 50 శాతం గ్రామాల్లో రీసర్వే పూర్తి అయ్యిందని, ఇంకా 448 గ్రామాల్లో రీసర్వే మొదలు పెట్టాల్సి ఉందన్నారు.


మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

గతంలో జరిగిన సర్వే ఏమైనా పొరపాట్లు జరిగి ఉంటే వాటిని సరిదిద్దాలన్నారు. గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా 15 రోజుల్లో తప్పులను సరిదిద్దాలన్నారు. మొదటి విడత చేపట్టిన సర్వేలో సుమారు 6,83,000 సర్వే రాళ్లను పాతడం జరిగిందని, వాటిపై ఉన్న రాజకీయ నాయకులు పేర్లను తొలగించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని చెప్పారు.

3వ వారం నుంచి సేకరణ..

నవంబరు మూడో వారం నుంచి జిల్లాలో ధాన్యం సేకరణకు సిద్ధం కావాలని జేసీ ఆదేశించారు. జిల్లాలో ఈ ఏడాది సుమారు 3,20,000 మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. జిల్లాలోని 501 రైతు సేవా కేంద్రాలు,పిఏసీఎస్‌లు రైతు మిత్ర సంఘాలు ద్వారా ధాన్యం సేకరణ జరుగుతుందన్నారు. సమావేశంలో ఆర్డీవోలు కీర్తి, బత్తుల వెంకటసత్యవాణి, ఏఎస్ఎస్ రామ్మోహన్, పశు సంవర్ధక శాఖ జేడీ రమణ, సర్వే శాఖ ఏడీ రమణమూర్తి, సివిల్ సప్లయ్ డీఎం మీనాకుమారి తదితరులు ఉన్నారు.

ఎవరిని నిందిద్దాం?

- విద్యుత్ తీగెలపై చెట్టు కొమ్మలు
- రోజంతా తొలగించని అధికారులు

గజపతినగరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో విద్యుత్ తీగెలపై శుక్రవారం తెల్లవారు జామున చెట్టు కొమ్మలు విరిగిపడిపోయాయి. ఆర్ అండ్ బీ శాఖ భవనానికి వెళ్లే దారిలోని విద్యుత్ వైర్లపై ఓ చోట... రైల్వే కాలనీకి వెళ్లే విద్యుత్ వైర్లపై మరోచోట చెట్టు కొమ్మలు విరిగి పడి ఉన్నాయి. దీంతో రైల్వే స్టేషన్‌కు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చినా సకాలంలో స్పందించలేదని స్థానికులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఉదయం సంఘటన జరిగితే సాయంత్రం ఇన్‌చార్జి ఏఈ ఆదిత్య ఆధ్వర్యంలో చెట్ల కొమ్మలను తొలగించే పని చేపట్టినట్టు స్థానికులు చెబుతున్నారు. పొరపాటున ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యులవుతారని ప్రశ్నిస్తున్నారు.


రైల్వేస్టేషన్ రోడ్డులో విద్యుత్ వైర్లపై విరిగిపడిన చెట్టుకొమ్మలు

అన్నదాతకు సాగునీటి కష్టాలు

- పొట్ట దశలోఎండిపోతున్న వరి పైరు
- ఆందోళన చెందుతున్న గజపతినగరం మండలం రైతులు



బంగారమ్మపేట వద్ద చెరువు నుంచి మోటారుతో నీటిని తరలిస్తున్నరైతు

గజపతినగరం, అక్టోబరు 25: (ఆంధ్రజ్యోతి): గజపతినగరం మండలంలో అన్న దాతలు ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది రుతు పవనాలు సమయంలో ఆశించిన వర్షాలు కురవక పోవడంతో పూర్తిస్థాయిలో జలాశయాలు నిండ లేదు. దీంతో ఖరీఫ్ ఆరంభం నుంచి అన్నదాతలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పొట్ట దశలో ఉన్న వరిపైరుకు నీరందకపోవడంతో కొన్ని చోట్ల ఎండిపోతోంది. దీంతో బంగారమ్మపేట, బూదే విపేట, పాతబగ్గాం, మదుపాడ, తదితర గ్రామాల్లో రైతులు మోటార్లతో చెరువులు, జలాశయాల అడుగున ఉన్న నీటినితోడి పంటను రక్షించు కోవడానికి పాట్లుపడుతున్నారు. ఈ ఏడాది మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 3,900 హెక్టార్లలో రైతులు వరి సాగు చేస్తున్నారు. ఖరీఫ్ ఆరంభంలో సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఆలస్యంగా నాట్లు వేశారు. తర్వాత వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటసాగుకు అష్టకష్టాలు పడ్డారు. ఈతరుణంలో పొట్టదశలో వర్షాలు లేకపోవడంతో అన్నదాతలు గుబులు చెందుతున్నారు. పంటను రక్షించుకోవాలన్న ఆశతో రైతులు అదనపు పెట్టుబడులు పెట్టి మోటార్లతో నీరు తోడుతున్నారు.

గత పాలకుల వల్లనే తాగు నీరు కలుషితం

- శవ రాజకీయాలు చేస్తున్న వైసీపీ నాయకులు ● చీపురుపల్లి ఎమ్మెల్యే కళావెంకటరావు



మాట్లాడుతున్న కళావెంకటరావు

చీపురుపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):గుర్ల డయేరియా మరణాలపై వైసీపీ నాయకులు శవ రాజకీయాలు చేస్తున్నారని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు విమర్శించారు.తాగు నీటి వనరులు కలుషితం కావడానికి గత పాలకులే కారణమన్నారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకోడానికి ఆ పార్టీ నాయకులు టీడీపీపై బురద జల్లుతున్నారన్నారు. శుక్రవారం చీపురుపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ గుర్ల డయేరియా సంఘటనపై జిల్లా వైద్య అధికారులు, సిబ్బంది సకాలంలోనే స్పందించారన్నారు. జిల్లాలోని పంచాయతీలకు చెల్లించాల్సిన 126 కోట్లు బుధవారం సాయంత్రానికి ఖాతాల్లో సిద్ధంగా ఉన్నాయన్నారు. మెజారిటీ పంచాయతీలు తమ చేతిలో ఉన్నప్పటికీ ఆ నిధులు ఎందుకు వెచ్చించలేదో వైసీపీ నాయకులు వారి మద్దతుదారులనే అడగాలని ఎమ్మెల్యే డిమాండ్‌చేశారు. చీపురుపల్లిలో బుధవారం పిచ్చికుక్కల దాడితో గాయపడిన వారికి అధికారులు సకాలంలో చికిత్స అందించారన్నారు. తోటపల్లి కుడి ప్రధాన కాలువలో పూడితతీత, తుప్పల తొలగింపునకు ప్రభుత్వం 50 లక్షలు మంజూరు చేసిం దన్నారు. రిజర్వాయరు నుంచి చివరికి వరకూ కుడి ప్రధాన కాలువను బాగు చేసేందుకు 2.87 కోట్లు మంజూరయ్యాయన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభం కానున్నదని తెలిపారు. సమావేశంలో నాయకులు కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, ముల్లు రమణ, సారేపాక సురేష్, జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పశుగణనకు సహకరించాలి: కోళ్ల



లక్కవరపుకోట: పశుగణన పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పశుగణనకు అందరూ సహకరించాలని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకు మారి కోరారు. శుక్రవారం మల్లివీడు పశువైద్య కేంద్రంలో వైద్యులు ఎం.తులసి ఆధ్వర్యంలో పశుగణన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా18 రకాల గణనకు సంబంధించి పోస్టర్ విడుదలచేశారు. కార్యక్రమంలో ఏడీలు చలపతిరావు, గంగాధర్ పాల్గొన్నారు.

●చీపురుపల్లి, అక్టోబరు 25 (ఆంధ్ర జ్యోతి):పశగణనకు సంబంధించిన గోడ పత్రికను ఎమ్మెల్యే కిమిడి కళావెంకట రావు శుక్రవారం విడుదల చేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఏడీ శారద, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

● డెంకాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలిపల్లి పశువుల ఆసుపత్రిలో భోగాపురం అసిస్టెంట్ డైరెక్టర్ ఏడీ మహాపాత్రో ఆధ్వర్యంలో 21వ అఖిల భారత పశుగణన మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో నెల్లిమర్ల అసిస్టెంట్ డైరక్టర్ చక్రవర్తి, అక్కివరం పశువైద్యాధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



విభిన్న ప్రతిభావంతుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరంరూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేయనున్నట్టు ఎమ్మెల్యే విజయనగరం అదితి గజపతిరాజు చెప్పారు. శుక్రవారం నగరంలోని టీడీపీ కార్యాలయంలో ని 31వ డివిజన్ నుంచి 50వ డివిజన్‌లో గల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతులు స్వీకరించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ వినతులను ఆన్‌లైన్ చేసి, ప్రభుత్వ విధివిధానాలు అనుసరించి, ప్రాధాన్యత క్రమంలో సమస్యలను పరిష్కరించనున్నట్టు చెప్పారు.

ఆరోగ్య నివేదికలు పునః పరిశీలించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న జగన్మోహనరావు

గరుగుబిల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతీ గ్రామానికి సంబంధించి ఆరోగ్య నివేదికలు ఎప్పటికప్పుడు పునఃపరిశీలించి ప్రజల ఆరోగ్యం మెరుగుకు అవసరమైన చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు సూచించారు. రావివలస పీహెచ్‌సీని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆసుపత్రికి వస్తున్న రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధులు ఏ మేరకు నమోదవుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఓపీ, ఐపీతో పాటు పాము కాటు, కుక్క కాటుతో ఎవరైనా ఆసుపత్రికి వస్తున్నారా అని చికిత్స వివరాల రికార్డులను పరిశీలించారు. ఫార్మసీలో మందుల లభ్యత, కాల పరిమితి వివరాలు, వ్యాక్సిన్ నిల్వలు వినియో గిస్తున్న తీరు, నిర్వహణను పరిశీలించారు. పీహెచ్‌సీలో ప్రసవాలు సంఖ్య మెరుగుకు కృషి చేయాలన్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్ష జరిపి క్షేత్రస్థాయిలో ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహణపై ఆరాతీశారు. కార్యక్రమంలో వైదుడు కె.కార్తీక్, డీఎస్‌వో శంకర్, సూపర్ వైజర్లు ప్రకాశ్, సన్యాసమ్మ, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

క్లోరినేషన్ చేయించాలి

రాజాం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):పంచాయతీల్లో ఉన్న రక్షిత మంచినీటి పథకాలు ట్యాంకులకు ప్రతి రోజూ క్లోరినేషన్ చేయించాలని ఎంపీడీవో వి. శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. అనంతరం గురవాంలో పారిశుధ్య పనులను పరిశీలించారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

సాలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సాలూరు ప్రాంతం ఒడిసా రాష్ట్ర సరిహద్దులో ఉన్నందు వల్ల డ్రైవర్లు, క్లీనర్లు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, అప్పుడు మాత్రమే ప్రమాదాలను నివారించగలమని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జేవీఎస్ఎస్ఎస్ ప్రసాద్ కోరారు. పట్టణంలో శుక్రవారం సాలూరు లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో రహదారి భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. అనంతరం రహదారి భద్రత వైద్యాధికారి నారాయణరావు వాహనం నడిపేటప్పుడు గుండెనొప్పి వస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయంపై నేరుగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ అప్పలనాయుడు, లారీ యూనియన్ అధ్యక్షుడు గొర్లె మధు, అక్కేన అప్పారావు తోపాటు పలువురు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

వేపాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వల్లంపూడి ఎస్ఐ బొడ్డు దేవి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని సోంపురం జడ్పీ ఉన్నత పాఠ శాలలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకుని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడు ఆతవ రవిశంకర్ సారధ్యంలో వ్యాచరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బీపీఏ రాజు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి క్షీరాభిషేకం

రాజాం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాజాంలోని మల్లిఖార్జున నారాయణ సన్నిధానంలో శుక్రవారం అయ్యప్పస్వామికి గురుస్వామి నంది సూర్యప్రకాష్‌రావు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. అర్చకులు ధర్మారావు వేద మంత్రోచ్చరణ మధ్య పూజలు జరిగాయి. కార్యక్రమంలో 101 మంది అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

పాలకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సబ్‌జైల్లో ఉన్న రిమాండ్ ఖైదీల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని శ్రీకాకుళం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. పాలకొండ సబ్ జైలును మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఇన్‌చార్జి ఛైర్మన్ పీఎస్‌వీబీ కృష్ణ సాయితేజ్‌తో కలిసి ఆయన శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన కిచెన్, స్టోర్‌రూమ్‌లో ఉన్న సరుకులను పరిశీలించారు. ఖైదీలకు ఇస్తున్న ఆహారాన్ని నాణ్యమైన సరుకులతో తయారు చేసి అందించాలని జైలు సూపరింటెండెంట్ బి.జోగులుకు సూచించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. జైల్లో అన్ని సదుపాయాలు ఉన్నాయా.. ఇబ్బందులు ఏమైనా పడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. మీరు బెయిల్ కోసం న్యాయవాదిని కోరితే లీగల్ సర్వీసెస్ కమిటీ లాయర్‌తో మాట్లాడాలని సూచించారు.పరిశీలనలో న్యాయవాదులు గొర్లెల సత్యంనాయుడు, వెంకటేశ్వరరావు, శామ్యూల్, జైలు హెడ్‌వార్డర్స్ పి.చంద్రరావు, విజయ్‌కుమార్, హేమసుందర్, ఏఎస్ఐ శ్రీనివాసరావు ఉన్నారు.



సబ్‌జైలులో సూచనలిస్తున్న సన్యాసినాయుడు

ఇసుక టిప్పర్ స్వాధీనం

బొబ్బిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారాది వేగావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను శుక్రవారం వేకువజామున పట్టుకున్నట్లు ఏఎస్ఐ జి.భాస్కరరావు తెలిపారు. మెరకముడిదాం మండలం గోపన్నవలసకు చెందిన రెడ్డి త్రినాథ 25 టన్నుల సామర్థ్యం గల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పట్టుకున్నామని చెప్పారు. టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని నిందితునిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దొంగతనానికి పాల్పడిన ఇద్దరి అరెస్టు

గరివిడి, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): గరివిడిలోని గర్భాం రోడ్డులో నివాసముంటున్న చెరుకూరి వెంకటరమణమూర్తి ఇంట్లో ఈనెల పదో తేదీన దొంగతనానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు.బాధితుడు కుటుంబసభ్యులు ఇంట్లో లేని సమ యంలో విజయనగరానికి చెందిన సోమశేఖర్, జగదీష్ దొంగతనానికి పాల్పడ్డారని చెప్పారు.ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకొని చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం



మందులు అందజేస్తున్న తులసీనాయుడు

రామభద్రపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా హెరిటేజ్ పలు కార్యక్రమాలు రూపొందిస్తోందని ఆ సంస్థ రీజినల్ మేనేజర్ పి.తులసీనాయుడు తెలిపారు. మండలంలోని ఆరికతోటలో హెరిటేజ్ పాడిరైతులకు ఉచితంగా మందులు పంపిణీ కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో విజయనగరం ఏరియా మేనేజర్ మనోహర్, బొబ్బిలి ప్లాంట్ మేనజర్ ఈ.సన్యాసినాయుడు, సూపర్‌వైజర్ బి.రామారావు, ఆరికతోట ఏజెంట్ వర్రి రామ్మూర్తి, పాడిరైతులు వర్రి వెంకటరావు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

విజయనగరం రింగురోడ్డు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల వేతన సవరణ, పెన్షన్ సవరణను నిరాకరించడంతో ఉద్యోగులు, పెన్షన్ దారులకు అన్యాయం జరుగుతోందని, తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఆ సంస్థ ఈయూ ప్రతినిధులు అలుగు వెంకటరావు, కృష్ణకుమారి, రమణమ్మలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం భోజన విరామ సమయంలో సమన్వయకమిటీ పిలుపుమేరకు నిరసన తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మణకుమార్, శకుంతల పాల్గొన్నారు.

బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాలి

గంట్యాడ, అక్టోబరు 25(విజయనగరం) ఖరీఫ్‌లో ధాన్యం సేకరణకు సంబంధించి మిల్లర్లు నవంబరు పదోతేదీలోగా బ్యాంకు గ్యారెంటీలు సమర్పించాలని తహశీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి సూచించారు. శుక్రవారం గంట్యాడలో మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. మిల్లర్లు వద్ద ఉన్న గన్నీలు పీఏసీఎస్‌లో అందజేయాలని సూచించారు. సమావేశంలో సీఎస్‌డీటీ నారాయణమూర్తి పాల్గొన్నారు.

●వంగర, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో నిబంధనలు పాటించాలని, మిల్లర్లు రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ధర్మారావు కోరారు. శుక్రవారం వంగరలో మిల్లర్లు, అధికారులతో సమావేశం ఏర్పాటుచేశారు. తునికల్లో తేడాలు లేకుండా చూడాలన్నారు.



గంట్యాడ: మాట్లాడుతున్న నీలకంఠేశ్వరరెడ్డి

జనావాసాల్లో మద్యం దుకాణం వద్దు



మద్దువలసలో నిరసన తెలుపుతున్న మహిళలు

వంగర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్దువలసలో జనావాసాల్లో ఏర్పాటుచేసిన మద్యం దుకాణం తరలించాలని మహిళలు నిరసన తెలిపారు. ఇక్కడ రామాలయం సమీపంలో మంజూరుచేసిన మద్యం దుకాణం మరో ప్రాంతానికి తరలించాలని డిమాండ్‌చేశారు. ఈ మేరకు గ్రామంలోని గ్రామసచివాలయం నుంచి షాపు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీరాముడి చిత్రపటంతో షాపు నిర్వహిస్తున్న చోట నిరసన తెలిపారు. దుకాణం వేరేచోటికి మార్చకపోతే ఆమరణ నిరాహార దీక్షకు వెనుకాడేదిలేదని మహిళలు పేర్కొన్నారు. నిరసనకు బురాడ వెంకటరావు మద్దతు తెలిపారు.

వేతనాల చెల్లింపునకు హామీ

రాజాం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఏపీ పంచాయతీ రాజ్ విభాగంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ టెక్నికల్ అసిస్టెంట్లకు ప్రతినెల వేతనాలు చెల్లించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రులు నారా లోకేష్, అచ్చెన్నాయుడు, పవన్ కళ్యాణ్ హామీఇచ్చారని జిల్లా టెక్నికల్ అసిస్టెంట్లు అసోసియేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు టంకాల వైకుంఠం తెలిపారు. ఈ మేరకు మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

డొంకాడలో డయేరియా లక్షణాలు



గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గంట్యాడ, అక్టోబరు 25(విజయనగరం) మండలంలోని డొంకాడలోని పలువురికి డయేరియా లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. శుక్రవారం పెదమజ్జిపాలెం పీహెచ్‌సీ డాక్టరు పల్లవి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించడంతో పలువురికి డయేరియా లక్షణాలు ఉన్నట్లు బయటపడింది. బి.సన్యాసి, పి.సన్యాసి, ఆర్.విశ్వనాధం, ఎ.కమల, ఎల్.తాత, ఆర్.అప్పారావులు డయేరియా లక్షణాలు నేపథ్యంలో చికిత్స పొందిన తరువాత తగ్గుముఖం పట్టినట్లు వైద్య సిబ్బంది గుర్తించారు. ఈ సందర్భంగా కొత్తగా గ్రామానికి చెందిన ఎల్.రామకృష్ణ డయేరియా లక్షణాలు గుర్తించడంతో పెదమజ్జిపాలెం పీహెచ్‌సీలో చికిత్స అందించారు. గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించారు. పారిశుధ్యం పనులు నిర్వహించారు.

త్వరలో స్కిల్ సెంటర్ ప్రారంభం

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జేఎన్‌టీయూలో త్వరలో స్కిల్ సెంటర్‌ను ప్రారంభిస్తామని రాష్ట్ర సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమలు శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. శుక్రవారం విజయనగరంలోని మంత్రి కార్యాలయంలో జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసి రాజ్యలక్ష్మి మంత్రితో సమావేశమయ్యారు.

న్యూస్ బాక్స్

నేటి నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

విజయనగరం రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం ప్రారంభంకానుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదు చేపడుతున్నామని పేర్కొన్నారు.పార్టీ శాశ్వత సభ్యత్వం ఈ ఏడాది నుంచి కొత్తగా చేపడుతున్నామని, ఇందుకు రూ.లక్ష చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. క్రియాశీలక కార్యకర్త కింద సభ్యత్వ నమోదుకు రూ.100 చెల్లించాలని పేర్కొన్నారు. పాతవారు తమ సభ్యత్వాన్ని రెన్యువల్ చేయించుకోవాలని కోరారు. విజయనగరంలోని కార్యాలయంలో శనివారం కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున తదితరులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

●రాజాం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): . రాజాం టీడీపీకార్యాలయంలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లాలోనే అగ్రగామిగా నిలపాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఉదయం 11 గంటలకు మునిసిపల్ కార్యాలయం ఆవరణలో మెప్మా బజార్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

అండమాన్ నికోబార్‌లో..

అండమాన్ నికోబార్ దీవుల్లో ఆన్‌లైన్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రాంభించేందుకు వెళ్తున్నట్లు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. అక్కడి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మాణిక్యరావు యాదవ్ తనను ఆహ్వానించారని పేర్కొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

రాజాం,అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాజాం పట్టణంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటగిరి నారాయణరావు, పట్టణాధ్యక్షులు జొన్నాడ రంజిత్ పాల్గొన్నారు.

రేపు సుపథం పరీక్షలు

కొత్తవలస, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కొత్తవలస జడ్పీ ఉన్నతపాఠశాలలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సుపదం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సుపథం ప్రతిభా పరీక్షలను నిర్వహించనున్నట్లు జగద్గురు పీఠం బృందం, సుపథం సంస్థ ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ సందర్భంగా పద్య, శ్లోకపఠనం, దేశభక్తి గేయాలు, విలువలు, ప్రశ్నోత్తర రామాయణం పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నాయి. విద్యార్థులు ముందుగా 9440464 012, 98498 16009 నంబర్లకు ఫోన్‌చేసి పేర్లు నమోదుచేసుకోవాలని కోరాయి.

ఓటు హక్కు కల్పించాలి

గజపతినగరం,అక్టోబరు 25: (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రైమరీ టీచర్లకు ఓటుహక్కు కల్పించే విధంగా ఎన్నికలసంఘం నిర్ణయం తీసుకోవాలని ఎస్టీయూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.చంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఓటు హక్కు కల్పించాలని ఎన్నికల సంఘాన్ని కోరనున్నట్లు పేర్కొన్నారు.

భోజనం రుచికరంగా ఉండాలి

రేగిడి, అక్టోబరు 25: (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్నబోజనం రుచికరంగా ఉండాలని ఎంఈవో-1, 2లు వరప్రసాదరావు, బి.ఏరకయ్యలు కోరారు.ఈమేరకు శుక్రవారం గుళ్లపాడు ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు.

సేవాభావం అలవరచుకోవాలి

రామభద్రపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ సేవాభావం అలవరచుకోవాలని బొబ్బిలి సర్కిల్ రూరల్ ఇన్‌స్పెక్టర్ కె.నారాయణరావు సూచించారు. మండలంలోని నాయుడువలస ఎస్సీ వీధిలో శుక్రవారం కారుణ్య ఫౌండేషన్, బొబ్బిలి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో దోమతెరల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కారుణ్య ఫౌండేషన్ ఛైర్మన్ జేసీ రాజు, బొబ్బిలి రోటరీ క్లబ్ ఛైర్మన్ సింధ్రి శ్రీనివాసరావు, వారణాశి శ్రీహరి, నాయుడువలస ఉప సర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వెయ్యి ఫారంపాండ్ల నిర్మాణమే లక్ష్యం

రామభద్రపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో వెయ్యి ఫారంపాండ్ల నిర్మాణానికి లక్ష్యంగా పెట్టుకున్నామని ఉపాధిహామీ పథకం ఏపీవో గొలగాని త్రినాథరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని కొండకెంగువలో ఫారంపాండ్లను పరిశీలించారు.

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం: ఎస్పీ

విజయనగరం క్రైం, అక్టోబరు 25: (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం జిల్లాపోలీసు కార్యాలయంలో పోలీసు వేల్ఫేర్ డే నిర్వహించి, వారి నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. వ్యక్తిగత, శాఖపరమైన సమస్యలను ఆయన నోట్ చేసుకున్నారు. పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతామని తెలిపారు.



సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

బొబ్బిలి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని నారాయణప్పవలస, కాసిందొరవలసల గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. తొలుత రికార్డులను పరిశీలించి సిబ్బందితో సమీక్షించారు. కార్యక్రమంలో కార్యదర్శి గుంట్రెడ్డి సుగుణ, ఈవోపీఆర్డీ భాస్కరరావు పాల్గొన్నారు.

●బాడంగి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తేరు, బొత్సవానివలస సచివాలయాలను ఎంపీడీవో ఎస్.రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ ఉన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళం



కలెక్టరుకు చెక్కు అందజేస్తున్న జేఎన్టీయూ సిబ్బంది

విజయనగరంకలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితులకోసం జేఎన్టీయూ గురజాడ విజయనగరం అధ్యాపకులు, సిబ్బంది తమ ఒకరోజు వేతనం రూ. 1,03,998 విరాళం అందజేశారు. ఈ మేరకు చెక్కును కలెక్టరు అంబేద్కర్‌కు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ, డిప్యూటీ రిజిస్ట్రార్ గంగరాజు అందజేశారు.

క్రీడల్లో రాణించాలి

గుర్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని గుర్ల ఎంఈవో-2 ఎం.శ్రీనివాసరావు తెలిపారు.శుక్రవారం చింతలపేట ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను సన్మానించారు. నాలుగో తరగతికి చెందిన డ్రాపౌట్ విద్యార్థిని కె.గ్రీష్మంత్ ఇంటిని సందర్శించి తల్లిదండ్రులతోమాట్లాడి పాఠశాలకు వచ్చేలా అవగాహన కల్పించారు. హెచ్ఎం గౌరీదేవి, పీఈటీ లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గరివిడి (మెరకముడిదాం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మెరకముడిదాం జడ్పీ ఉన్నత పాఠశాలలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సైబర్ నేరాలు అరికట్టడంలో యువత పాత్ర అనే అంశంపై బుదరాయవలస ఎస్ఐ జె.లోకేష్‌కుమార్ శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కోట్ల ఎల్లంనాయుడు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

శృంగవరపుకోట అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరంజనేయ స్వామిని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి శుక్రవారం కలిశారు. విశాఖలోని సర్క్యూట్ కార్యాలయంలో సోషల్ వెల్ఫేర్, సచివాలయ కార్యదర్శులతో సమీక్షించా రు. విశాఖ లోక్‌సభ స్థానం పరిధిలో ఎస్.కోట నియోజకవర్గం ఉండడంతో ఆమె సమావేశానికి హాజరయ్యారు.

చెరువులో మట్టి తొలగించాలి

బొబ్బిలి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని మిలటరీ కాలనీ పక్కన ఉన్న చెరువులో వేసిన మట్టి తొలగించకపోతే వాల్టా చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని నోటీసులు జారీ చేయాలని ఆర్ఐ రామ్‌కుమార్‌ను తహసీల్దార్ ఎం.శ్రీను ఆదేశించారు. చెరువులో ఓ యాజమాన్యం అనుమతులు లేకుండా ఎర్ర మట్టి గ్రావెల్స్‌ను ట్రాక్టర్లతో తెప్పించి చదును చేయడంతో తహసీల్దార్ పరిశీలించారు. ఈ మేరకు ఆ యాజమానిపై తహసీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా మిలటరీ కాలనీ ప్రక్కన ఉన్న చెరువులో కొందరు అనుమతి లేకుండా ఎర్ర మట్టి గ్రావెల్స్‌ను ట్రాక్టర్లతో తెప్పించి చదును చేయడం సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ పరిశీలించారు. కబ్జాకు గురవుతున్న చెరువును పరిరక్షించాలని, సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

గరుగుబిల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉల్లిభద్రకు చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ టి.స్వాతిని విధుల నుంచి తొలగిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ అయ్యాయి. ఆమె పలు అవకతవకలకు పాల్పడినట్టు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో గ్రామస్థాయిలో జిల్లా డ్వామా పీడీ కె.రామచంద్రరావు విచారణ నిర్వహించి, నివేదికలను అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు డ్వామా కార్యాలయం సీనియర్ సహాయకులు సెప్టెంబరు నెలలో దర్యాప్తు నిర్వహించారు. అవసరమైన నివేదికలు అందించగా ఆమెకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా తాత్కాలికంగా విధుల నుంచి తొలగింపు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గరుగుబిల్లి ఎంపీడీవో జి.పైడితల్లికి సమాచారం అందించారు. ఇదిలాఉండగా పథకంలో అవినీతికి పాల్పడిన మొత్తాన్ని చెల్లించాలని ఆదేశించారు. మొత్తం రూ.97,676లను వారం రోజుల్లో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్, గ్రామాభివృద్ధి ఖాతాకు జమ చేయాలని ఆదేశించారు. చెల్లించని పక్షంలో తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు.

సాధారణ రకం ధాన్యం క్వింటా రూ.2,300

విజయనగరం కలెక్టరేట్,అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ సంబంధించి సాధారణ రకం ధాన్యం క్వింటా రూ. 2300, గ్రేడ్ ఏ రకం క్వింటా రూ.2320 చొప్పున కొనుగోలు చేయనున్నామని సివిల్ సప్లయ్ డీఎం మీనా కుమారి పేర్కొన్నారు. కలెక్టరు చాంబర్‌లో సివిల్‌సప్లయ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూపొందించి బ్యానర్లను కలెక్టరు అంబేద్కర్, జేసీ సేతుమాధవన్ ఆవిష్కరించారు.

రేషన్ సరుకులు సకాలంలో చేరాలి



ఎంఎల్‌సీ గొడౌన్‌ను తనిఖీ చేస్తున్న పీవో అశుతోష్ శ్రీవాస్తవ

పాచిపెంట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పౌర సరఫరాల మండల స్థాయి స్టాక్ పాయింట్ (ఎంఎల్ఎస్)ను పార్వతీపురం ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రిజిష్టరులో నమోదైన మేరకు స్టాక్ పాయింట్‌లోని సరుకులను ఉన్నది, లేనిది పరిశీలించారు. సకాలంలో రేషన్ సరుకులు ప్రజలకు చేరాలని, అందుకు సంబంధించిన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను పీవో ఆదేశించారు. ● మండలంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ శుక్రవారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థినులతో కాసేపు ముచ్చటించారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలో ఉత్తమ ప్రతిభను కనపర్చేలా విద్యార్థులను తీర్చి దిద్దాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. ఈ పర్యటనలో పౌర సరఫరాలశాఖ, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

పాలకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న అంతర్ కళాశాలల టోర్నమెంట్, ఎంపికలు శుక్రవారంతో ముగిశాయి. బీఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ సౌజన్యంతో ఈ క్రీడా పోటీలను నిర్వహించారు. ముగింపు సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంబాబు మాట్లాడారు. టోర్నమెంట్‌కు అన్ని విధాలా సహకరించిన పల్లా కొండలరావును అభినందించి, సత్కరించారు. వాలీబాల్, కబడ్డీ పోటీల్లో రాజాం జీసీఎస్ఆర్, సీఎల్‌నాయుడు డి గ్రీకాలేజ్, శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయన్నారు. విజేతలు సౌత్‌జోన్ విశ్వ విద్యాలయ స్థాయిలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, బి.రాజు, సీతారాం, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని సభలు ఎందుకు?

కొమరాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించని గ్రామసభలు ఎందుకని చినఖేర్జిల సర్పంచ్ గంగాధర్ అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం రేగులపాడు గ్రామంలో గ్రామసభను నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆల్ఫా ఇన్ఫ్రా ప్రో ప్రైవేట్ లిమిటెడ్ కర్మాగారానికి సుమారు 15 ఏళ్ల కిందట గిరిజనుల డీపట్టా భూములను అప్పటి ప్రభుత్వం కట్టబెట్టినప్పటికీ ఆ కంపెనీ ఈ ప్రాంతంలో కర్మాగారం నిర్మించకపోవడమే కాకుండా గిరిజనులకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయలేదన్నారు. తక్షణమే గిరిజనులకు న్యాయం చేకూరేలా రెవెన్యూ యంత్రాంగం కృషి చేయాలని ఆయన కోరారు. డీటీ, సర్వేయర్, వీఆర్‌వో, తదితరులు పాల్గొన్నారు.

పశు అక్రమ రవాణాపై చర్యలు

పార్వతీపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పశు అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటామని జిల్లా పశు సంవర్థక అధికారి ఎస్.మన్మథరావు తెలిపారు. పశు సంపద ఏదీ సంరక్షణ అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు పశు అక్రమ రవాణా విషయంపై సమాచారం వచ్చిన వెంటనే సంబంధిత పోలీస్‌శాఖ, రెవెన్యూశాఖ, మార్కెటింగ్‌శాఖ, రోడ్డు రవాణాశాఖ, జంతు సంరక్షణ కమిటీ సహకారంతో బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. పశు వైద్య కేంద్రాల భవన మరమ్మతుల నిమిత్తంపై అధికారులకు నివేదిక సమర్పిస్తామని చెప్పారు.

ఇన్‌చార్జిని మారిస్తేనే సభ్యత్వాలు

సీతంపేట రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పాలకొండ నియోజకవర్గంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిని మారిస్తేనే పార్టీ సభ్యత్వాలు చేయడంలో ముందుకు సాగుతామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు శుక్రవారం కె.గుమ్మడ గ్రామంలోని జీడితోటలో టీడీపీ నాయకులు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి తాము ఎప్పుడూ వ్యతిరేకం కాదని, పార్టీ ఇన్‌చార్జిని మారిస్తేనే సభ్యత్వాల నమోదు ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు సవరతోట మొఖలింగం, మాలయ్య, నిమ్మక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి మృతి

గరుగుబిల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రావుపల్లి గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి బోను శివున్నాయుడు(61) శుక్రవారం మృతి చెందారు. ఈయన గతంలో గరుగుబిల్లి మండలంలోని పలు పంచాయతీల్లో కార్యదర్శిగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం కొమరాడ మండలంలో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. గత కొద్ది రోజులుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. వైద్య సేవలు పొందుతూ మృతి చెందారు.

వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండాలి

సాలూరు,అక్టోబర్ 25(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సిబ్బంది నిత్యం రైతులకు అందుబాటులో ఉండాలని జిల్లా శిక్షణా కేంద్రం సమన్వయ అధికారి ఆర్.శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం సాలూరులోని వ్యవసాయ అగ్రిల్యాబ్‌లో డివిజన్ పరిధిలో ఉన్న వ్యవసాయ, ఉద్యానవన సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని.. ప్రస్తుతం వరి పంటలో వస్తున్న తెగుళ్లపై వివ రించారు. వాటి నివారణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏడీఏ భారతి మాట్లాడుతూ రాబోయే రబీ సీజన్లో పెసర, మినుము సాగు, కొత్త వంగడాలు ఎంపిక యాజమాన్య పద్ధతులపై వివరించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాస రాజు, ఏవోలు అనూరాధ, కె.తిరుపతిరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభానికి చర్యలు

రాజాం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నవంబరులో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నామని రాజాం మార్కెట్ కమిటీ కార్యదర్శి సమతం శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. రైతులు ముందుగా మార్కెట్ కమిటీ కార్యాలయంలో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది ఇంతవరకు రూ.43 లక్షలు మార్కెట్ కమిటీ ఆదాయం వసూలు చేశామని, మిగిలిన లక్ష్యాన్ని చేరుకోవడానికి అన్నిచర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

96 మంది ఉద్యోగాలకు ఎంపిక

బొబ్బిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సిడాప్, స్థానిక ఐటీఐ కళాశాల శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 303 మంది హాజరుకాగా 96 మందిని ఉద్యోగాల కోసం ఎంపిక చేశారు. ఈసందర్భంగా జస్ట్ డయల్, యంగ్ ఇండియా, టాటా అడ్వాన్స్, పేటీఎం కంపెనీలకు అధికారులు నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఎంపికైన వారికి నియామకపత్రాలను అందజేశారు. ఐటీఐ ప్రిన్సిపాల్ జీవీ రమణా రావు, జిల్లా నైపుణ్యాభివృద్ధిసంస్థ అధికారి ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

చెరకు తోట దగ్ధం

జియ్యమ్మవలస, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కుందరతిరువాడలో సర్పంచ్ ముదిలి పెద్దినాయుడుకు చెందిన రెండు ఎకరాల చెరకు తోట గురువారం రాత్రి అగ్నికి ఆహుతయ్యింది. విషయం తెలుసుకున్న చినకుదమ, కుందరతిరువాడ గ్రామ రైతులందరూ సమిష్టిగా మంటలను ఆర్పి వేశారు. ఆ సమయంలో గాలి లేకపో వడంలో వల్ల మరో 40 ఎకరాల చెరకు పంట అగ్ని ప్రమాదం నుంచి బయటపడింది. దీనిపై రెవెన్యూ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి న్యాయం చేయాలని బాధిత రైతు కోరుతున్నారు.



పాలకొండ: సబ్ కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వెళుతున్న దృశ్యం



సీతానగరం: నిరసన తెలుపుతున్న పాల రైతులు, రైతు సంఘం నాయకులు

సమస్యలు పరిష్కరించరూ..

తమ సమస్యలను పరిష్కరించాలంటూ జిల్లాలోని పలుచోట్ల వివిధ సంఘాల నాయకులు, కార్మికులు, ఉద్యోగులు ఆందోళనలు చేపట్టారు.

పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల నిరసన

పార్వతీపురంటౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జీవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈనెల 25వ, 26వ తేదీల్లో మస్టర్ పాయింట్‌ల వద్ద ధర్నాలు, 27న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్‌ల ఇంటి వద్ద సామాజిక రాయబార కార్యక్రమాలు, 28న ధర్నా నిర్వహిస్తామని చెప్పారు.

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

పాలకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలసలో దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని కుల వ్యవస్థ వ్యతిరేక పోరాట సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం పాలకొండ సబ్ కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగు నాయుడు మాట్లాడుతూ ఈనెల 22న జియ్యమ్మవలస మండలం గడసింగిపురం గ్రామానికి చెందిన పలువురి యువకులను కులంపేరుతో దూషించి దాడి చేసి, తిరిగి వారిపైనే తప్పుడు కేసులు పెట్టారన్నారు. వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు సీతారాం, దుర్గారావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

పాల సేకరణ ధరను పెంచాలి

సీతానగరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ పాల డైరీ పాల సేకరణ ధరను రూ.5కు తగ్గించి రైతుల ఆదాయానికి గండి కొట్టడం తగదని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి అన్నారు. ఈ మేరకు శుక్రవారం కాసయ్యపేటలోని పాల సేకరణ కేంద్రం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. తగ్గించిన పాల సేకరణ ధర పెంచకపోతే ఈనెల 29న విశాఖ డైరీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకుడు రెడ్డి రమణమూర్తి, రైతు సంఘం నాయకులు గేదెల సత్యనారాయణ, బంటు దాసు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు రెడ్డి ఈశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

వలంటీర్లను కొనసాగించండి

సాలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వలంటీర్లను విధుల్లో కొనసాగించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షురాలు బలగ రాధ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సాలూరు పట్టణంలోని కొంకివీధిలో ఉన్న ఓ కల్యాణ మండపంలో ఆమె వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్షణం వలంటీర్లను కొనసాగించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

ఆరోగ్య మిత్రల వినతి

కురుపాం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కురుపాం సీహెచ్‌సీలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలు స్థానిక వైద్యాధికారిణి లాలసకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తూ తమను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 29వ తేదీ నుంచి విధులు బహిష్కరిస్తామని తెలిపారు.

పశుగణన ప్రారంభం

పాలకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మురళి మాట్లాడుతూ ఈనెల 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు పశుగణన కార్యక్రమం ఉంటుందన్నారు. పాలకొండ మండలం, అర్బన్, రూరల్‌లో సుమారుగా 18,500 ఇళ్ల నుంచి 20 మంది ఎన్యుమెరేటర్స్ విషయ సేకరణ చేస్తారన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. పశువైద్యశాఖ సహాయ సంచాలకుడు డా.ప్రభామాణిక్యరావు, మండల పశు వైద్యాధికారి బి.సిద్దార్థ, ఎస్‌వో చిన్నారావు, పశుగణన ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు. ● జియ్యమ్మవలస, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 25 నుంచి 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు 21వ అఖిల భారత పశుగణన చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మండల పశు వైద్యాధికారి ఎన్.మునికుమార్ తెలిపారు. మండలం మొత్తంలో 13,189 కుటుం బాలకు సంబంధించి పశుగణన చేయాల్సి ఉందన్నారు. శుక్రవారం వెంకటరాజపురం గ్రామంలో దీనికి సంబం ధించిన పోస్టర్‌ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దత్తి లక్ష్మణరావు ఆవిష్కరించారు. అక్కడి నుంచే పశుగణనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ● గరుగుబిల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని మరుపెంట గ్రామంలో ఎంపీపీ ఉరిటి రామారావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు. ఎంపీపీతో పాటు సర్పంచ్ ఉరిటి నిర్మల, మండల పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ ఎస్.సురేష్‌కుమార్ పాల్గొన్నారు. ● భామిని, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాట్రగడ గ్రామంలో ఇన్‌చార్జి పశు వైద్యాధికారి సంతోష్‌కుమార్ శుక్రవారం పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా కరపత్రాలు ఆవిష్కరించారు. ప్రత్యేక ఆహ్వానితుడు తోట సింహాచలం, వీపీఏలు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో ఆస్తుల అన్యాక్రాంతం

బొబ్బిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఆస్తుల అన్యాక్రాంతమయ్యాయని కృష్ణా జిల్లాకు చెందిన సీబీసీఎన్‌సీ ట్రస్టు చైర్మన్ దీపక్ కుమార్, కార్యదర్శి రాజ్‌కుమార్ ఆరోపించారు. మంత్రి నారా లోకేశ్, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన చొరవతో సీబీఎం బాలికల ఉన్నత పాఠశాలకు రక్షణకు సంబంధించి మార్గం సుగమమవుతోందని తెలిపారు. శుక్రవారం స్థానిక సీబీఎం చర్చిలో క్రైస్తవభక్తసంఘం అధ్యక్షుడు గొంటి వేణు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా సేవలందించుకునే తాము గత ప్రభుత్వ హయాంలో అనుకోకుండా మోసపోయామన్నారు. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా గల వందల కోట్ల రూపాయల విలువ చేసే సీబీఎం ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయన్నారు. సమావేశంలో స్థానిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల విధులపై అవగాహన

పూసపాటిరేగ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్ పనితీరు, స్టేషన్‌లో వినియోగించే పరికరాలు, పోలీసుల విధులపై ఎస్ఐ దుర్గాప్రసాద్ శుక్రవారం స్థానిక కేజీబీవీతోపాటు, పలు పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు వినియోగించే పరికరాలు, చట్టాలపై అవగాహన కలిగిఉండాలని తెలిపారు.

మృతుడి కుటుంబానికి నష్ట పరిహారం

పార్వతీపురం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడిలో మృతిచెందిన పెదబండపల్లి గ్రామానికి చెందిన దేవాబత్తుల యాకోబు కుటుంబానికి ఎమ్మెల్యే విజయచంద్ర శుక్రవారం పది లక్షల నష్ట పరిహారం చెక్కును అందించారు. ఏనుగుల దాడి ఘటన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లగా, ఆయన స్పందించి రూ.10లక్షలు మంజూరు చేయించారని ఎమ్మెల్యే తెలిపారు. డీఎఫ్‌వో ప్రసూన, బిర్లంగి శ్రీరామ నరేష్, సెక్షన్ అధికారి మనోజ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు బోను దేది చంద్రమౌళి, కార్యదర్శి జి.చంద్రమౌళి, చినరామ్మూర్తినాయుడు, మండల ఫకీరునాయుడు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబానికి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

నేటి నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

సాలూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో శనివారం నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మంత్రి సంధ్యారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాలూరులోని తన ఇంటి వద్ద సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామ ని చెప్పారు. అనంతరం ఆమె పార్వతీపురంలో జరగ బోయే కలెక్టర్ కార్యాలయంలో సమావేశానికి హాజరు కానున్నట్లు తెలిపారు. 28న సాలూరు మండలంలో, 29న మెంటాడ మండలంలోనూ, 30న మక్కువ మండలంలోనూ, 31న పాచిపెంట మండలంలోనూ సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో తాను పాల్గొంటున్నట్లుగా ఆమె తెలిపారు. ● గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 27 నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు ఆ పార్టీ మండల కన్వీనర్ పాడి సుధ తెలిపారు. లోవముతా ఇతర మండల ప్రాంతంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జగదీశ్వరి పాల్గొంటారన్నారు.

నేడు మంత్రి ఆధ్వర్యంలో సమీక్ష

పార్వతీపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆధ్వర్యంలో శనివారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, తోయక జగదీశ్వరిలు హాజరు కానున్నారు. ఈ సమావేశంలో జిల్లా అభివృద్ధికి తీసుకున్న చర్యలు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలు మం త్రి సమీక్షించనున్నారు.

కెడకెల్లలో చెక్‌పోస్టు

వీరఘట్టం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కడకెల్లలో గనులశాఖ కొత్తగా చెక్‌పోస్టును ఏర్పాటు చేసింది. శ్రీకాకు ళం జిల్లా పరిధిలో టెక్కలి డివిజన్ అధికారులు ఈ చెక్‌పోస్టును శుక్రవారం పరిశీలించారు.

పోలీసు అమర వీరులకు జోహార్లు



ర్యాలీలో మాట్లాడుతున్న సీఐ అప్పలనాయుడు

సాలూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరులకు జోహార్లు అని పట్టణ సీఐ అప్పల నాయుడు అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాలూరు ప్రధాన రహదారిపై విద్యార్థులతో నినాదాలు చేశారు. పలువురు పోలీసులు పాల్గొన్నారు. ● ఎస్పీ ఆదేశాల మేరకు ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణంలో డాగ్ స్క్వాడ్ సిబ్బందితో సీఐ తనిఖీలు నిర్వహించారు. ● అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులను బలోపేతం చేసే ఉద్దేశ్యంతో పాచిపెంట మండలం పి.కొనవలస చెక్‌పోస్ట్ వద్ద రూరల్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ పొందిన డాగ్స్‌ను, అదేవిధంగా డ్రోన్ కెమెరాలను ఉపయోగించి మాక్‌డ్రిల్‌ను నిర్వహించారు. చెక్‌పోస్ట్ సిబ్బందికి వాహనాలు తనిఖీ చేసే విషయంలో పలు సలహాలు సూచనలు చేశారు.

● జియ్యమ్మవలస, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చినమేరంగి జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం చినమేరంగి ఎస్ఐ పి.అనీష్ ఆధ్వర్యంలో వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సైబర్ క్రైం నిరోదంలో యువత పాత్ర అనే దానిపై వ్యాస రచన పోటీలు జరిపినట్లు ఎస్ఐ తెలిపారు.

పరీక్షలు కాదండోయ్..



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న పోలీస్ సిబ్బంది

బెలగాం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రం చూస్తుంటే ఇదేదో పోలీసులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఉంది కదూ.. అలా కానేకాదు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో వారికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలు అనే అంశంపై ఏఎస్పీ దిలీప్ కిరణ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన సిబ్బందికి బహుమతులు అందజేయనున్నారు. ఎస్ఐలు ఫక్రుద్దీన్, దినకర్, డీసీఆర్‌బీ సిబ్బంది పర్యవేక్షించారు.

సెంచూరియన్‌లో 'బిజ్ ఫెస్ట్ 2.0'



మాట్లాడుతున్న విశాఖపట్నం ఐఐఎం ప్రొఫెసర్ కల్యాణ్

నెల్లిమర్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యాపార రంగంలో విజయం సాధించాలంటే వాటిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని విశాఖపట్నం ఐఐఎం ప్రొఫెసర్ కె.కల్యాణ్ అన్నారు. శుక్రవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన బిజ్ ఫెస్ట్ 2.0 అనే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. విద్యార్థులు తమకు అవసరమైన రంగాల్లో నైపుణ్యం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెంచూరియన్ వీసీ ప్రశాంత్‌కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డా.పల్లవి, మేనేజ్‌మెంటు విభాగం డీన్ డా.మోహన్‌బాబు, డీన్‌లు డా.సన్నిడయాల్, డాక్టర్ విజయబాబు, ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, అనిల్‌కుమార్, గ్రామ్ తరంగ్ సీఈవో బాబుశంకర్, పీఎస్‌వీ రమణారావు, హెచ్‌ఆర్ మేనేజర్ శ్రీనివాస్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.